క్లుప్తంగా

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం


హేమంత్ కుమార్


మూర్తిరాజు

పరవాడ: పెదతాడి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు సోమవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని వారి తల్లిదండ్రులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెదతాడికి చెందిన నాగరాజు, శివలక్ష్మి దంపతుల కుమారుడైన శానాపతి హేమంత్‌కుమార్ 9వ తరగతి, ఈశ్వరరావు, మంగమ్మ కుమారుడైన శానాపతి మూర్తిరాజు 8వ తరగతి తానాం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. సోమవారం ఉదయం సైకిల్‌పై తానాం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రం 5.30 గంటల వరకు ఇంటికి తిరిగి రాలేదు. విద్యార్థుల ఆచూకీ కోసం తల్లిదండ్రులు పాఠశాల, పరిసర గ్రామాల్లో వాకబు చేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో పరవాడ పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు.

ఉమాచంద్రమౌళీశ్వర స్వామికి విశేష అభిషేకాలు


ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి బిల్వపత్రాలతో పూజలు నిర్వహించారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

ఘనంగా గరగ మహోత్సవం


గరగ మహోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు

పరవాడ: వచ్చే నెల 7న పరవాడలో జరగనున్న పైడిమాంబ పండగలో భాగంగా సోమవారం రాత్రి గరగ మహోత్సవాన్ని గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. పైడిమాంబ అమ్మవారి గరగను గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, పెద్ద చెరువు ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తోటగరువు హైస్కూల్‌లో తనిఖీలు

ఆరిలోవ: తోటగరువు హైస్కూల్‌లో సోమవారం మిడ్ డే మీల్ జిల్లా కోఆర్డినేటర్ జె.వి.ఎస్.శాస్త్రి, టాయిలెట్ మెయింటెనెన్స్ ఆఫీసర్(టీఎంవో) ఎ.వి.సత్యనారాయణ తనిఖీలు చేశారు. ఇక్కడ మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ఇక్కడ విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా? లేదా? అని ఆరా తీశారు. సోమవారం మెనూ ప్రకారం వండిన బిర్యానిని పరిశీలించగా.. ఉడకకపోవడంతో వంట మనిషి, ఉపాధ్యాయులపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. సరిగా భోజనం పెట్టకపోవడంతో ఇంటి నుంచి ఎక్కువ మంది తీసుకొచ్చి తింటున్నట్లు పిల్లలు తెలిపారని శాస్త్రి చెప్పారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యం కారణంగా భోజనాలు సరిగా పిల్లలకు పెట్టడం లేదన్నారు. దీంతో పాటు రోజురోజుకూ ఇక్కడ హాజరు శాతం తగ్గుతుందని, శనివారం 71 శాతం, సోమవారం 69 శాతం పిల్లలు హాజరు నమోదైందన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం టీఎంవో సత్యనారాయణ మాట్లాడుతూ టాయిలెట్లలో నీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ పాఠశాలపై నివేదిక తయారుచేసి అధికారులకు పంపిస్తామన్నారు.

పరదేశిమాంబ పండగకు వేళాయె..!


క్రీడాకారులతో కరచాలనం చేసి పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు తదితరులు


తవ్వవానిపాలెంలో కొలువైన పరదేశిమాంబ అమ్మవారు

సబ్బవరం: తవ్వవానిపాలెంలో కొలువైన పరదేశిమాంబ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం చర్యలు తీసుకున్నారు. ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. పండగలో భాగంగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలను మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన మొదటి నాలుగు జట్లకు వరుసగా రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు నగదు బహుమతులను అందజేయనున్నారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోకం స్వామినాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బోకం కాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

సినీతారలు రాక

మంగళవారం అనుపు మహోత్సవంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పలువురు సినీతారలతో పాటు జబర్దస్త్ కామెడీ ఆర్టిస్టులు ఈ పండగలో తళుక్కున మెరవనున్నారు. డీజే టిల్లు ఫేమ్ హీరోయిన్ నేహాశెట్టి, యాంకర్‌లు అనసూయ, సౌమ్యారావు, సింగర్ మోహన్ భోగరాజుతో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమానికి స్టేజ్‌తో పాటు బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో మిరుమిట్లు గొలిపేలా ముస్తాబు చేశారు.


సినీతారల సాంస్కృతిక కార్యక్రమానికి చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

7న పరదేశిమాంబ పండగ


పదదేశిమాంబ పండుగ గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న సర్పంచ్ దేవి, గ్రామ పెద్దలు

పరవాడ: తానాం గ్రామంలో వచ్చే నెల 7న పరదేశిమాంబ అమ్మవారి పండగ జరగనుంది. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను సర్పంచ్ కన్నూరు దేవి, గ్రామ పెద్దలు సోమవారం ఆవిష్కరించారు. పండగను పురస్కరించుకుని వచ్చే నెల 5 నుంచి 7వ తేదీ వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ నెల 24న ప్రారంభమైన మండల స్థాయి బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు మార్చి 6వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కన్నూరు వెంకటరమణ, మాజీ సర్పంచ్ పైల రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పైల కృష్ణారావు, పెద్దలు వర్రి వసంతరావు, పైల జానకీరావు, దేముడుబాబు, గొరుపూటి సన్యాసిరావు, పైల ముని పాల్గొన్నారు.

సాలాపువానిపాలెంలో బోరు ఏర్పాటు

పరవాడ: సాలాపువానిపాలెం గ్రామంలో జీవీఎంసీ అధికారులు బుధవారం మంచినీటి బోరును ఏర్పాటు చేశారు. ప్రజల కోరిక మేరకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఇటీవల జీవీఎంసీ అధికారులతో చర్చించి గ్రామంలో మంచినీటి బోరు ఏర్పాటుకు కృషి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ సాలాపు సంతోష్, అప్పలరాజు, శ్రీను, రాజు, నూకరాజు, రామకృష్ణ, బాబూరావు, దొరబాబు తదితరులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సన్మార్గమే యువత భవితకు పూలబాట



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిఐ ఈశ్వరరావు

పరవాడ: యువత సన్మార్గంలో నడిచి భవిష్యత్తును పూలబాటగా తీర్చుదిద్దుకోవాలని పరవాడసీఐ పి.ఈశ్వరరావు సూచించారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో సోమవారం ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వినియోగం, కుల, మత, వర్గ, వివక్ష వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత తప్పుడు మార్గంలో పయనించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాల నివారణ కోసం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ కోరారు. గొప్ప సమాజం కోసం సైనికుడు, రైతు ఎంత అవసరమో సన్మార్గంలో నడిచే యువత కూడా అంతే అవసరమని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి పేర్కొన్నారు. విద్యార్థులు తప్పుతోవ పట్టకుండా వారి తల్లిదండ్రులు, విద్యా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీఈవో కె.నిశాంత్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం


ఉక్కు దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 746వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన ఎం.ఎస్.ఎం, ఎస్.టీ.ఎం విభాగాల నాయకులు, కార్మికులు దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. కార్మికులు న్యాయం జరిగే వరకు దీక్షను విరమించేదిలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే కార్మికుల జీవితాలు సర్వనాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను కాపాడుకోవాలంటే ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: సింహపురి కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, కండక్టర్ల మార్పు పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ డి.వి.ఎల్.కుమార్ తెలిపారు. 98వ వార్డులోని సింహపురి కాలనీ, పద్మావతి నగర్, మైత్రి నగర్, జంగాల కాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

పెందుర్తిలో... 11కేవీ గుర్రంపాలెం, 11కేవీ పెందుర్తి ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ పెందుర్తి ఏఈ ఎస్.శ్యామ్‌సుందర్ సాహు తెలిపారు. వెలంపేట, అనకాపల్లి రోడ్డు, కొత్తవలస రోడ్డు మొత్తం ఏరియా, సాయినగర్, ఎల్‌ఐసీ కాలనీ, పాత పెందుర్తి, రాతిచెరువు, నూకాలమ్మ ఆలయం పరిసరాలు, ఆదిత్యనగర్, లక్ష్మీనగర్, ప్రగతి నగర్, వీవీఎస్ సుందర్‌నగర్, డీఆర్‌సీ మాల్ ఏరియా, శాంతి కల్యాణ మండపం ఏరియా, గుర్రంపాలెం, ముదపాక, గోవిందపురం, సరిపల్లి, రాయవరపువానిపాలెం, జంగాలపాలెం, బొడ్డునాయుడుపాలెం, రాజయ్యపేట, చిక్కాలపేట, నీలకంఠాపురం, అప్పన్నపాలెం, ఎల్లిగిల్లిపాలెం, వులగాలపాలెం, అయ్యప్ప కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

గొర్రెలు, మేకల విక్రయాల జోరు


కొనుగోలు చేసి తమ ప్రాంతాలకు వ్యాన్లలో తరలిస్తున్న మేకలు, గొర్రెలు


తాళ్లపాలెం సంతలో అమ్మకానికి వచ్చిన మేకల మంద

- కొత్త అమావాస్య ముందు ఊపందుకున్న క్రయవిక్రయాలు
- కోస్తాంధ్ర నుంచి భారీగా తరలివస్తున్న మేకలు, గొర్రెలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకల అమ్మకాలు జోరందుకున్నాయి. గత వారం వరకు అమ్మకాలు కాస్త స్తబ్దంగా ఉన్నాయి. కొత్త అమావాస్య జాతర సమీపిస్తుండటంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. ధరలు కూడా కాస్త పెరిగాయి. దీంతో పెంపకందార్లు, రైతులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కోస్తాంధ్ర నుంచి భారీగా జీవాలు

తాళ్లపాలెం వారపు సంతకు పూర్వపు విశాఖ జిల్లాతోపాటు తూర్పుగోదావరి, ఏజెన్సీ ప్రాంతాల నుంచి గొర్రెలు, మేకల పెంపకందార్లు ప్రతి వారం వస్తుంటారు. వీటిని కొనుగోలు చేయడానికి ఆయా ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు, హోటళ్ల నిర్వాహకులు, మందలుగా మేపుకునే పెంపకందారులు వస్తుంటారు. వీటిని కొనుగోలు చేసి తమ ప్రాంతాలకు తీసుకు వెళుతుంటారు. దసరా, సంక్రాంతి, కొత్త అమావాస్య, తదితర పెద్ద ఉత్సవాలతోపాటు గ్రామాల్లో జరిగే ఉత్సవాలకు గొర్రెలు, మేకలను కొనుగోలు చేస్తారు. అయితే సంక్రాంతి తర్వాత నుంచి గత వారం వరకు గ్రామాల్లో చెప్పుకోదగిన పెద్ద ఉత్సవాలు లేవు. దీంతో డిమాండ్ లేక గొర్రెలు, మేకల అమ్మకాలు తగ్గాయి. సంతకం వీటి రాక కూడా తగ్గింది.

మందలుగా కొనుగోళ్లు

అయితే వచ్చే నెలలో జరగనున్న కొత్త అమావాస్యకు జిల్లాలో జాతరలు నిర్వహించడానికి దాదాపు ప్రతి గ్రామంలోను గొర్రెలు, మేకలు వినియోగిస్తారు. దీంతో వీటికి గిరాకీ ఏర్పడుతోంది. కొందరు ముందుగానే వీటిని కొనుగోలు చేసి ఉత్సవాలకు సిద్ధం చేస్తారు. ఈ నేపథ్యంలో సంతకు సుమారు వెయ్యి వరకు గొర్రెలు, మేకలు అమ్మకానికి వచ్చాయి. జీవాల సైజ్, వయసు ఆధారంగా రూ.3 వేల నుంచి రూ. 20 వేల వరకు అమ్మకాలు సాగాయి. ఒక్కొక్కదానికి గత వారం కంటె రూ.2 వేలు ధర అదనంగా పెరిగిందని వ్యాపారులు తెలిపారు. వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు వీటిని కొనుగోలు చేసి ఆటోల్లోను, వ్యాన్లలో తమ ప్రాంతాలకు తరలించుకు వెళ్తున్నారు. కొందరు జీవనోపాధి కోసం గొర్రె, మేకల మందలను కొనుగోలు చేశారు.

ఎరువు కోసం మంద కొనుగోలు

ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభం కావడంతో ఖరీఫ్ పంటలు వేసే వరకు పంట భూములు ఖాళీగా ఉండటం వల్ల మేతకు అనువుగా ఉంటుంది. కొందరు రైతులు కూడా తమ భూముల్లో సారం కోసం గొర్రెలు, మేకల మందలను ఖాళీగా ఉన్న భూముల్లో ఏటా ఎరువు కోసం రాత్రి వేళ నిలుపుతారు. ఇందు కోసం కొందరు మందలను కొనుగోలు చేస్తారు. అలాగే మందలో మేకలుగాని, గొర్రెలు గాని ఎదిగిన తర్వాత కుటుంబ అవసరాలకు అమ్ముకుంటాం. ఇప్పుడు మేపుకోవడానికి రూ.2.5 లక్షలు ఖర్చు చేసి గొర్రెల మందను కొనుగోలు చేశా.

– ఈగల సతీష్, కట్టుబోలు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు, ప్రశంసా పత్రాలతో కరాటే విజేతలు, కోచ్‌లు

పరవాడ: విశాఖలో యంగ్ ఇండియన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 26న జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో వాడచీపురుపల్లి డ్రాగన్ లయన్స్ కరాటే విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో వాడచీపురుపల్లి, జాలరిపేట, సమ్మెంగపాలెం, మంగప్పయ్యగారి గ్రామాల నుంచి విద్యార్థులు తలపడ్డారు. ప్రథమ స్థానంలో 19 మంది, ద్వితీయ స్థానంలో 9 మంది, తృతీయ స్థానంలో ముగ్గురు విద్యార్థులు నిలిచారు. విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కోచ్‌లుగా ఎస్.నూకరాజు, ఓలిశెట్టి ప్రసాద్, ఎం.తులసీరావు వ్యవహరించారని కోచ్ పుష్పారావు తెలిపారు.

ఆదర్శనీయుడు చంద్రశేఖర్ ఆజాద్


చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: నేటి యువత చంద్రశేఖర్ ఆజాద్ దేశభక్తిని ఆదర్శంగా తీసుకుని పాటించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడలో చంద్రశేఖర్ ఆజాద్ 92వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ ఆజాద్ గొప్పవీరుడని, సాయుధ పోరాటంలో ముందు నిలిచారన్నారు. విప్లవ పోరాట పటిమ కలిగిన ఆజాద్ తన 15వ ఏటనే సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయ్యారని గుర్తు చేశారు. భరత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను బ్రిటిష్ వారి నుంచి విడిపించే క్రమంలో తనను చుట్టి ముట్టిన పోలీసులను చంపి తనను తాను కాల్చుకొని వీర మరణం పొందిన గొప్ప వీరుడని కొనియాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి చంద్రశేఖర్ ఆజాద్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.డి.నాయుడు, కె.అప్పారావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఎన్టీపీసీ వద్ద ధర్నా చేస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు మాసవరపు అప్పలనాయుడు డిమాండ్ చేశారు. యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సోమవారం ఎన్టీపీసీ మెయిన్‌గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలం నుంచి కార్మికుల డస్ట్ అలవెన్స్ పెంచకపోవడం దారుణమన్నారు. మెడికల్ చెకప్‌ను అర్థంతరంగా నిలిపివేయడం అన్యాయమన్నారు. కార్మికులందరికీ ఒకే రంగు పాస్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో గిరిజన మహిళకు దొరకని బెడ్

- బెడ్ ఇచ్చామంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్


కేజీహెచ్ రాజేంద్రప్రసాద్ వార్డులో నేల మీద పడుకున్న గిరిజన మహిళ


మంచం మీద తల్లిదండ్రులతో కృష్ణవేణి

మహారాణిపేట: కేజీహెచ్‌లో గిరిజన మహిళకు బెడ్ కేటాయించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే ఆస్పత్రి పిల్లల వార్డులో గిరిజన పసికందు మృతి చెందడం, మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తరలించిన ఘటన మరిచిపోక ముందే మరో గిరిజన మహిళకు బెడ్ ఇవ్వలేదన్న వార్తలు వస్తున్నాయి. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముంచంగిపుట్ మండలం వనగుమ్మ గ్రామానికి చెందిన కె.కృష్ణవేణిని తల్లిదండ్రులు ఈనెల 25న వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్పించారు. దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ఆమె ఊపిరితిత్తుల్లో నీరు చేరింది. దీంతో 25న రాత్రి భావనగర్ వార్డులో చేర్పించి చికిత్స అందజేశారు. చికిత్సతో వ్యాధి తగ్గుముఖం పట్టడంతో కృష్ణవేణిని రాజేంద్రప్రసాద్ వార్డు 'డి' బ్లాక్‌కు ఆదివారం తరలించారు. అక్కడ పడకలు ఖాళీ లేవు. మరో మహిళ ఉండే మంచాన్ని కృష్ణవేణికి కేటాయించారు. అంటే ఒకే మంచాన్ని ఇద్దరు ఉపయోగించాలన్న మాట. అయితే ఈ మంచం తీసుకోవడానికి కృష్ణవేణి నిరాకరించారు. అప్పటికే ఆ వార్డులో ఒక మహిళ చనిపోవడంతో కృష్ణవేణి అక్కడ ఉండడానికి నిరాకరించినట్లు బంధువులు తెలిపారు. అయితే కృష్ణవేణి ఆ వార్డులోనే కింద పడుకుని రాత్రి నిద్రించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తెల్లవారే సరికి జిల్లాలో వైద్యులు అప్రమత్తం అయ్యారు. ఆగమేఘాల మీద కృష్ణవేణికి మంచం కేటాయించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని, వార్డులో పడకలు ఖాళీ లేకపోయినా ఆమెకు మంచం ఇచ్చామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. రోగిని మంచం మీదకి మార్పు చేస్తున్న సమయంలో ఎవరో ఫొటో తీశారని, ఆమెకు మంచం నిరాకరించినట్టు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని సూపరింటెండెంట్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

విభాగాధిపతి దృష్టికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైర్ రాడ్ మిల్ విభాగం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తాడన్న నేతృత్వంలో సోమవారం నాయకులు విభాగాధిపతి శర్మను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా విభాగం గౌరవాధ్యక్షుడిగా ఎ.రవీంద్రనాథ్, సలహాదారుడిగా ఎ.బాలస్వామి, అధ్యక్షుడిగా ఎస్.వెంకటశెట్టి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా పి.అప్పారావు, బి.తిరుపతిరావును నియమించినట్టు వారు తెలిపారు. అనంతరం విభాగాధిపతికి నూతన కార్యవర్గ జాబితాను అందజేసి సత్కరించారు.